

# కన్నీటి నురుగు

రాత్రి పది దాటింది. రత్తయ్య సాయంత్రం ఆరింటి తర్వాత రిక్షా బాడుగకు తిప్పడు. ఇంటికి తీసుకువెళ్ళిపోతాడు. ఆ రాత్రి ఇంటికి వెళ్ళబుద్ధి కాలేదు. మనసు బరువుగా ఉంది. నాలుగయిదుసార్లు టీ తాగాడు. ఆకలి చచ్చిపోయింది. ఇంటికి వెళ్ళినా ఇంట్లో ఎవరూ ఉండరు. బోసిగా ఉంటుంది. అతని భార్య చనిపోయి ఐదు సంవత్సరాలయింది. పెళ్ళి అయ్యాక వేరే కాపురం పెట్టాడు కొడుకు. బుద్ధి పుట్టినప్పుడు

వస్తాడు. కొన్నిసార్లు చాలారోజులు రాడు. తను అక్కడకు వెళ్ళి ఉండలేదు. ఉండమని కొడుకు ఎప్పుడూ అనలేదు.

రిక్షాను 'రామిరెడ్డి తోట'లోనే చాలాసేపు నడిపాడు రత్తయ్య. వీధిదీపాలు లేవు. రాత్రి ఎనిమిది దాటితే ఆ వీధుల్లో విటుల తాకిడి ఎక్కువ ఉంటుంది. 'రామిరెడ్డి తోట' పాసింజర్లకు పేరుపొందింది. పగలు దాదాపు నిర్జనంగా నిద్రపోతుంటుంది.

అతనికి సావిత్రి కావాలి. సావిత్రి రెండో వీధిలోనో, మూడో వీధిలోనో ఉంటుందని విన్నాడు. ఎక్కడ ఉంటున్నదో సరిగా తెలియదు. ఆ వీధిలో ఉన్నవి చాలావరకు పాకల ఇళ్ళు. అక్కడక్కడ పెంకుటిళ్ళు ఉన్నాయి. ఇళ్ళముందు కొంతమంది స్త్రీలు నిలబడి ఉన్నారు. రిక్షాను చూడగానే వంగి రిక్షాలో ఏ పాసింజరయినా ఉన్నాడేమోనని తొంగి చూస్తున్నారు. ఎవరూ కనపించకపోయేసరికి నిరుత్సాహపడుతున్నారు. ఎవరో తప్ప డబ్బున్నవాళ్ళు ఇటువైపు రారు.

ఇద్దరు మహిళలు నిలబడి ఉన్నచోట రిక్షా ఆపి, "సావిత్రి ఎక్కడ ఉంటుందో చెప్పగలరా?" అడిగాడు.

"ఏమో తెలియదు" నిర్లక్ష్యంగా అంది ఒకామె. రెండో ఆమె "ఏ సావిత్రి?" అడిగింది.

రూపురేఖలు చెప్పాడు.

ఆమె నవ్వి "ఈ వీధిలోనే నలుగురు సావిత్రులు ఉన్నారు. ఒకామె తెనాలి సావిత్రి, రెండో ఆమె బాపట్లది, మూడో ఆమె చిలకలూరిపేట నుండి వచ్చింది. నాలుగో సావిత్రి ఒంగోలు నుండి వచ్చింది. ఎవరికయినా కావాలా?" అంది.

తల అడ్డంగా ఆడించాడు.

"ఏం మేం పనికిరామా?" అడిగింది మొదటి యువతి.

'గుంటూరు అమ్మాయి' అందామనుకుని మాట నోటి చివరివరకు వచ్చింది. "దరిద్రపు బేరం దొరికింది" అని ఆమె అనేసరికి ఇంకేమీ అడగలేకపోయాడు.

రిక్షా ముందుకు కదిలింది. ఈ వృత్తిలోకి వచ్చాక చాలామంది పేర్లు మార్చుకుంటారు. ఊరూ మారిపోతుంది. సావిత్రి ఉంటున్న ఇల్లు కనుక్కోవడం తేలికైన పనిలా అనిపించలేదు. మరో రెండు చోట్ల అడిగాడు. ఫలితం కనిపించలేదు. ఇంటికి

వెళ్ళిపోదామని నిశ్చయించుకుని రిక్షా ఎక్కాడు. రిక్షా చెయిను జారిపోయేసరికి, ఆపి సరిగా పెట్టి, పాత గుడ్డతో చేతులకు అంటిన నూనె తుడుచుకుంటూ రోడ్డుపక్కనే ఉన్న పాకవైపు చూశాడు. వరండాలోని లైటు వెలుగులో సావిత్రి బాసింపట్లు వేసుకుని కూర్చుని అద్దంలో చూస్తూ తల దువ్వుకుంటోంది.

రత్తయ్య ప్రాణం లేచి వచ్చింది. సందేహం లేదు. సావిత్రే! ఎన్ని సంవత్సరాల తర్వాత చూస్తున్నాడు? జీవితంలో మళ్ళీ సావిత్రిని చూడగలుగుతానని అనుకోలేదు. రిక్షాను రోడ్డు పక్కగా ఆపి వీధి తలుపు చిన్నగా తెరిచి లోపలకు వచ్చాడు. వెలుగు వరండా వరకే పరుచుకుని ఉంది.

సావిత్రి తల దువ్వుకోవడం అయిపోలేదు. కుందనపు బొమ్మలా ఉండేది. ఏంటిలా అయిపోయింది?

అతను వచ్చిన అడుగుల చప్పుడు వినిపించినా సావిత్రి తలెత్తి చూడలేదు. అంతకు మునుపే పాసింజర్ వచ్చి వెళ్ళాడు. "చెప్పండి. ఒక్కసారికా, రాత్రంతా ఉంటారా?" అడిగింది.

రత్తయ్య దుఃఖం ఆపుకోలేకపోయాడు. "సావిత్రీ! తలెత్తి చూడు. నేనమ్మా, నీ నాన్నను. ఇవాళ నీ పుట్టిన రోజు. కన్న మమకారం చంపుకోలేక చూద్దామని వచ్చాను తల్లీ" అన్నాడు ఏడుస్తూ.

**–'స్నేహ' (ప్రజాశక్తి ఆదివారం అనుబంధం), *25 మే, 2014***